ISBN : 978-93-86251-88-6

# హెచ్. ఆర్. చంద్రం గీతాసూక్తి శతకం - ఒక పరిశీలన

శ్రీమతి కొలిపాక అరుణ
అధ్యాపకురాలు, తెలుగుశాఖ
సి. హెచ్. ఎస్. డి. సెయింట్ థెరిసా
స్వయంప్రతిపత్తి మహిళా డిగ్రీకళాశాల,
ఏలూరు, ప॥గో॥జిల్లా.

"సనాతనస్య ధర్మః సనాతన ధర్మః" సనాతన ధర్మ వైభవాన్ని ప్రవచిస్తూ ఆర్ష ధర్మజ్యోతులుగా ప్రకాశించే ప్రామాణిక గ్రంథాలలో సాక్షాత్తు ఆ దేవదేవుని దివ్యవాణి "భగవద్గీత". భగవద్గీత భారతీయుల జ్ఞాన సంపద, "సర్వశాస్త్రమయి" అని స్తుతింపబడే "సర్వవేదార్థ సార సంగ్రహోభూతము" అని శ్రీ శంకరాచార్యుల వారిచే నిర్వచించబడింది. మహాభారతమునకు మకుటాయమానముగా భగవద్గీత నిలచింది. భీష్మపర్వంలో 24-25 అశ్వాసాల్లో కృష్ణపరమాత్మ "నిమిత్తమాత్రం భవసవ్యసాచిన్" అంటూ బోధించారు.

సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనందన:
పార్థో వత్స స్సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్

ధీరుడయిన అర్జునుడు కురుక్షేత్ర సంగ్రామమున భీరువుగా మారాడు. ఆ తరుణంలో అతనిని కర్తవ్యోన్ముఖునిగా చేయడానికి శ్రీకృష్ణుడు గీతోపదేశం చేశాడు. అది ఉపనిషత్తులు అనే గోవుల నుండి శ్రీకృష్ణుడు అనే గోవుల కాపరి పితికిన పాలు. కేవలం అర్జునుని సమస్యలకే కాదు ఆధునిక మానవుని సంక్షోభాలకు కూడా దీనిలో సమాధానం లభిస్తుంది.

కన్నీరు కార్చినా, కష్టాలలో ఉన్నా, నిరాశా నిస్పృహలు వెంబడించినా, కన్నతల్లి వలె ఓదార్పునిచ్చేది భగవద్గీత. "మనసు చెదిరినపుడు భగవద్గీత నాకెంతో సహాయం చేసింది" అని జాతిపిత మహాత్మాగాంధీ అన్నారు.

వ్యాసప్రోక్తమైన మహాభారతంలో భీష్మపర్వంలో 18 అధ్యాయాలుగా 700 శ్లోకాలలో చెప్పబడినది. గీత 'మోక్ష సప్తశతి' అని పిలువబడుతుంది. ప్రపంచంలోని పలు భాషలలోనికి అనువదించడమే కాక, వేల సంఖ్యలో వ్యాఖ్యానాలు వెలిశాయి అంటే అతిశయోక్తి కాదు.

ఆంధ్ర సాహిత్యంలో విశేష ప్రాచుర్యం పొందింది 'శతకప్రక్రియ'.

ISBN : 978-93-86251-88-6



అందునా ఆంధ్రపాఠకులకు అత్యంత ప్రీతి పాత్రమైన ఛందస్సు 'ఆటవెలది'. ఈ ఛందస్సులో భగవద్గీత శ్లోకాలను అచ్చు తెలుగులో అర్థమయ్యేరీతిలో సూక్తిశతకంగా వ్రాసి, పాఠకుల సౌకర్యార్థం సూక్తి ప్రాయమైన మూల శ్లోక భావాలను కూడా పొందుపరచారు 'గీతాసూక్తి శతక' కర్త శ్రీ హెచ్.ఆర్.చంద్రం గారు.

"ఆంధ్ర వాఙ్మయమున వచ్చిన సాహితీ ప్రక్రియలో శతకం ఒక విశిష్ఠ స్థానాన్ని సంపాదించుకుంది. తెలుగులో క్రీ.శ. 12వ శతాబద్ధంలో వృషాధిప శతకంతో శతక సాహిత్యం ఆరంభమైంది. ఈ 900 సంవత్సరములలో తెలుగు శతకం శాఖోపశాఖలుగా విస్తరిల్లి స్వరూపంలోనూ, స్వభావంలోనూ ఎంతో మార్పునొందింది. తెలుగు సాహిత్యంలో పద్యానికి ఒక విశిష్టత ఉంది. మరే ఇతర భారతీయ భాషల్లో పద్య ప్రక్రియ కన్పించదు. తెలుగులో వచ్చిన పద్యం శతకంగా మారి పద్యానికి కొత్త అందాలనద్దింది.

తొమ్మిది శతాబ్ధాలుగా వైవిధ్యంతో, వైలక్షణంతో , వైశిష్ట్యంతో తెలుగులో శతక సాహిత్యం వికాసం చెందుతూ వచ్చింది. అటువంటి శతకాలలో హనుమంతు రామచంద్రం గారి 'గీతాసూక్తి శతకం' ఒకటి.

భగవద్గీతలో 18 అధ్యాయములలోని సార్వదేశికాలు, సార్వకాలికాలు, సార్వజనీనాలు అయిన సూక్తి ప్రాయమైన అంశాలను పరిమిత సంఖ్యతో గ్రహించి ఈ శతక రచన చంద్రం చేశారు.

క్లైబ్యం మాస్మగమ: పార్థ నైతత్త్వయ్యుప పద్యతే
క్షుద్రం హృదయ దైర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప

ఈ శ్లోకమును పద్యరూపంలో కవిగారు క్రింది విధంగా రాశారు.

పనికి జంకరాదు పౌరుష హీనులై
అవసరమ్ము కలిగినపుడు నరులు,
వదిలివేయ వలయు హృదయ దౌర్భల్యంబు
కృష్ణగీత విశ్వ హృద్విజేత

విశ్వంలోని ప్రజలందరి హృదయాలను జయించింది శ్రీకృష్ణ పరమాత్మ బోధించిన భగవద్గీత. ఈ మకుటంతో 'పౌరుషం లేని వారు మాత్రమే పనికి వెనుకాడతారు. హృదయ దౌర్భల్యాన్ని వీడి కార్య రంగంలో జయించాలని' కవి సూటిగా సరళంగా చెప్పారు.

 ISBN : 978-93-86251-88-6

సాంఖ్య యోగంలో పుట్టిన వానికి మరణము తప్పదు, మరణించిన వానికి జననం తప్పదు కనుక అపరిహార్యములైన ఈ విషయముల యందు నీవు శోకింపతగదు. అను విషయమును చెప్తూ పుట్టినట్టి ప్రాణి గిట్టక తప్పదు, గిట్టినట్టి ప్రాణి పుట్టు మరల గాన చావు పుట్టుకల గూర్చి చింతేల? అంటూ ప్రశ్నించారు కవి చంద్రం.

ఒక కవి అన్నట్లు పుట్టినప్పుడు బట్టకట్టలేదు, పోయేటప్పుడు అని వెంటరాదు నడుమ బట్టకడితే నగుబాటు నాగరీకం పెరిగితే పొరపాటు వేదాంత సారం ఇంతే నయా అన్న మాటలు,ఆస్తిపాస్తులు, మానవ సంబంధాల కోసం తాపత్రయం పడటం ఎందుకు? అంటూ....

కానరారు పుట్టుటకు ముందు, మరణమ్ము
పొందు పిదప, నడుమ నుందు రంతె !
అట్టివారి గూర్చి ఆరాట పడనేల?
కృష్ణగీత విశ్వ హృద్విజేత

కలిమిలేములు, భార్యాబిడ్డలు, భవబంధాలు ఇవన్నీ కూడా మనం పుట్టుకకు ముందు లేవు. మధ్యలో వస్తాయి. మరణంతో మాయమైపోతాయి. ఇటువంటి వాని గురించి నువ్వు ఆరాటపడటం ఎందుకు? అంటారు కవి. స్వధర్మాచరణము గూర్చి చెబుతూ 'నిర్వహింపవలయు నిర్దిష్టకర్మ' ఎవరి ధర్మమును బట్టి వారు కార్యాచరణ చేయవలెను. అంతే కాని ఎన్నడూ వృత్తి ధర్మమును విడువరాదు. విడువదగదు, విడువ వద్దు అంటారు. అంతేకాకుండా ఫలితంతో సంబంధం లేకుండా కర్మ చేసే అధికారమే నీకు ఉన్నది. ఫలితమునందు ఆసక్తి లేకుండా, ఫలంతో నిమిత్తం లేకుండా కర్మయందు మనస్సు లగ్నం చేయాలి. అలా అని కర్మను (పనిని) ఆచరించకుండా ఉండటం ధర్మం ఏమాత్రం కాదు అంటూ 'యుక్త కర్మచేయుచుండంగ వలె' అను పద్యంలో వివరించారు.

ఇంద్రియములు, మనస్సు వశమునందు ఉండనివానియందు నిశ్చయాత్మక బుద్ధి ఉండదు. అట్టివాడు మూఢుడు. అంతేకాక ఎవరైతే మంచిని ఆచరిస్తారో అటువంటి వారు ఇతరులకు మార్గదర్శకులవుతారని చెబుతున్నారు ఆ శ్లోకం మూలంలో ఇలా ఉంది.

 ISBN : 978-93-86251-88-6

యద్యదాచరతి శ్రేష్ఠ: తత్తదేవేతరో జన:
స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే

చంద్రం గారు పై శ్లోకమును తెలుగులోకి వివరిస్తూ......

శ్రేష్ఠ పురుషుడెద్ది చేయునో తక్కొరుల్
దాని నాచరింప దలతు; రగుట
మంచి చేయువాడె మార్గదర్శకుడౌను
కృష్ణగీత విశ్వ హృద్విజేత

ఒక వ్యక్తి తాను చేయు మంచి పనుల ద్వారా శ్రేష్ఠుడనబడడమే కాక ఇతరులు అతడు ఆచరించిన పనిని ప్రమాణంగా స్వీకరించి, అతని మార్గాన్ని అనుసరిస్తారు. అట్టి వ్యక్తి ఆదర్శంగా నిలుస్తారని ఆవిధంగా వ్యక్తిచేసే కర్మలు ఉండాలని కవి సూచించారు.

ప్రతి ఇంద్రియ విషయములయందును రాగద్వేషములు దాగి యున్నవి. వాటికి మానవులు చిక్కరాదు. అవియే మానవులకు భయంకర శత్రువులుగా పరిణమిస్తాయని వివరించారు.

ధర్మమునకు హానికలిగినపుడు, అధర్మ వృద్ధియు కలుగు సమయములందు అవతార పురుషులు అవతరించి ఆదుకొంటారని చెప్పే శ్లోకం 'యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత' శ్లోకమును పద్యరూపంలో చెబుతూ....

ధర్మహానియు, అధర్మ వృద్ధియు గల్గు
అవసరమ్ములందు అవతరించి
ఆదుకొనెడి వారె అవతార పురుషులు
కృష్ణగీత విశ్వ హృద్విజేత

'పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్' శ్లోకం గూర్చి చెబుతూ...

శిష్ట రక్షణమ్ము, దుష్ట శిక్షణ చేసి
ధర్మ సుస్థిరతను ధరనొనర్ప
సమయ మెరిగి ప్రభువు సాక్షాత్కరించును
కృష్ణగీత విశ్వ హృద్విజేత

 ISBN : 978-93-86251-88-6

అని ధర్మమును సుస్థిరమొనర్చుటకు పరమాత్మ ప్రతి యుగమునందు అవతరిస్తారని పద్యరూపంలో చెప్పడం జరిగింది. ఇక పాప కార్యములు చేసేవారిని గూర్చి చెబుతూ వారిని తరింపచేసేది జ్ఞానమొక్కటే అని పాప జలధి చూచి భయపడనవసరం లేదని 'జ్ఞాన' మనే నౌకపైన ప్రయాణం చేసినట్లయితే నిస్సందేహంగా పాపసముద్రము నుండి ఖచ్చితంగా బయట పడగలమని సూచించారు. అదే విధంగా మంచి, చెడులను సమంగా స్వీకరించవలెనని అటువంటివారు బ్రహ్మవేత్త అంటూ 'స్వీకరించు నెవడు స్థిర చిత్తుడై' పద్యంలో చక్కగా వివరించారు.

పవిత్రమైన, నిర్మల బుద్ధితో ఫలితమునందు ఆసక్తి లేనివారైన పరమ భక్తునిచే సమర్పించబడిన పత్రముకాని, పుష్పముకాని, ఫలముకాని జలము కాని నేను ప్రత్యక్షముగా మిక్కిలి ప్రేమతో ఆరగించెదనని శ్రీకృష్ణ పరమాత్మ సెలవిచ్చారు. ఆ విషయమును గూర్చి చెబుతూ 'కొలువజాలు నెవడు కొండంత దేవుని కొండయంత పత్రి కోసి తెచ్చి? గుండె నిండ భక్తి యుండిన చాలదా?' అంటూ హంగు, ఆడంబరాలతో చేసే పూజా విధానాన్ని నిరసిస్తూ పరుల మెప్పుకోసం పాటించే ఆచారాల వలన భగవంతుని కృపకు పాత్రులు కాలేరని చెప్పారు.

సమాజంలో తప్పులు చేయని వారుండరు అనేది సత్యం. అయితే అంతవరకు తప్పులు చేసి దురాచారిగా ప్రవర్తించినవారు తమ తప్పులు తెలుసుకున్న తర్వాత మంచి దారిలోకి వచ్చినట్లయితే అతడు మంచి వానిగానె పరిగణింపబడతాడు. కానీ తప్పు అని తెలిసిన తరువాత కూడా సరిదిద్దుకోనట్లయితే అతడు క్షమించరాని నేరం చేసిన వానిగా పరిగణింపబడతాడు.

యస్మాన్నో ద్విజతే లోకో లోకాన్నో ద్విజతే చయ:
హర్షామర్ష భయోద్వేగై: ముక్తోయ: సచమే ప్రియ:

తోటివారితో కలసి మెలసి ఉండాలని తనవల్ల లోకానికి, లోకం వల్ల తనకు సంక్షోభం, క్లేశం, కలిగించనివాడు, కలగనివాడు సంతోష క్రోధాలు, భయం ఉద్వేగము పొందని వాడే నాకు మిక్కిలి ఇష్టుడు. అని మూలంలో ఉన్న విషయాన్ని కవిగారు 'పరుల కలసి మెలసి అరుసంబు క్రోధంబు' పద్యంలో చాలా చక్కగా వివరించారు. మానవులలో గల సత్త్వ, రజో, తమో గుణములను గూర్చి చంద్రంగారు చెబుతూ ఈ విధంగా వివరించారు.

ISBN : 978-93-86251-88-6

సత్త్య గుణము వలన సమకూరు సౌఖ్యంబు
లోగు కర్మలకు రజో గుణంబు
బుద్ధి గప్పి కష్టముల ద్రోయును తమంబు
కృష్ణగీత విశ్వ హృద్విజేత

సాత్త్విక సుఖం అనేది ఆదిలో విషం వలె, అంతాన అమృతం వలె ఉంటుంది. గురువులు బోధించే విషయములోని జ్ఞాన సారం తెలుసుకొని సముచితంగా ఎవరైతే ఆచరిస్తారో వారే సద్బుద్ధి కలిగిన వారు అంతేకాక గొప్ప విషయములను గుర్తించలేనటువంటి అల్పులకు, విముఖత చూపించే వారికి ఈ గీతను ఉపదేశించటం, వినిపించటం అపచారం సుమా ! అంటూ కవి గారు గీతాసూక్తి శతకం 107వ పద్యంలో వివరించారు.

యత్ర యోగేశ్వర: కృష్ణో యత్ర పార్థో ధనుర్ధర:
తత్ర శ్రీర్విజయో భూతి: ధ్రువా నీతిర్మతిర్మమ
ఎచట శక్తి యుక్తులేకమై యుండునో
అచట సర్వశుభము లమరియుండు
నీతి నియమములకు నెలవగు నచ్చోటు
కృష్ణగీత విశ్వ హృద్విజేత (పార్థుడు శక్తి శ్రీకృష్ణుడు యుక్తి)

ఈ విధంగా వ్యక్తి, కుటుంబం, వ్యాపారం, దేశం ప్రపంచం……సర్వకాల సర్వావస్థలయందు అన్వయించుకొని అనుసరించదగిన గీతావాణిని కవిగారు అందరికీ అర్థమయ్యే రీతిలో సరళతరంగా వ్రాశారు. ప్రపంచ ప్రఖ్యాత భగవద్గీతను మూలంలోని భావమునకు ఏమాత్రం భంగం కలుగకుండా అచ్చ తెలుగులో రాసి ప్రజలకు చేరువ చేసిన హనుమంతు రామచంద్రంగారు మిక్కిలి ప్రశంసనీయులు. గీతను అనుసరించు వారు ధన్యజీవులు.

**ఆధార గ్రంథాలు :-**

1) అమరకోశం – నామలింగాను శాసనము
2) ఉపశ్రీ భగవద్గీత
3) గీతా సూక్తి శతకం – చంద్రం
4) తెలుగు సాహిత్య చరిత్ర – డా॥ ద్వా.నా. శాస్త్రి
5) శ్రీమద్భగవద్గీత శ్లోక తాత్పర్యములు – గీతాప్రెస్, గోరఖ్‌పూర్
6) శబ్ద రత్నాకరము – బహుజనపల్లి సీతారామాచార్యులు

* * *